Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
25-07-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 231 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇండియన్స్‌కు నో జాబ్స్


### చైనాలో కంపెనీలు, ఇండియన్స్ కు ఉద్యోగాలా?

అమెరికన్ టెక్ కంపెనీలకు ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్:** చైనాలో ఫ్యాక్టరీలు నిర్మించే అమెరికా టెక్ కంపెనీలు, భారతీయులను ఉద్యోగులుగా నియమించుకుంటున్నాయని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. తన పాలనలో ఆ రోజులు ముగిశాయని హెచ్చరించారు. ఈ మేరకు న్యూయార్క్‌లో జరిగిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ సమ్మిట్‌లో ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

టాప్ న్యూస్



### తెలంగాణలో సామాజిక న్యాయం 2.0

- బలహీన వర్గాల కోసమే ఈ పోరాటం
- ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ అంగీకారం
- దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలి
- ఎక్స్ వేదికగా ఏఐసీసీ చీఫ్ ఖర్గే కీలక వ్యాఖ్యలు


03



### కుమ్మక్కు రాజకీయాలు

- అవినీతి జరిగిందంటూనే రక్షిస్తున్నారు
- బిజెపి ఎంపీ డికె అరుణ ఫైర్

02



### ఎవరికీ బెదిరేది లేదు

- విజయోత్సవంలో పవన్ కల్యాణ్
- తొలిరోజే 80 కోట్ల వీరమల్లు

03

# రేవంత్ అంచనాలకు మించి రాణించారు

## కులగణన నిర్వహించడం అంత తేలిక కాదు

### దేశానికి తెలంగాణ మోడల్ మార్గదర్శి

సామాజిక న్యాయానికి ఇదో మైలురాయి

బిజెపి సర్కార్ కులగణన సరిగా చేయదు

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేయాలి

ఇంగ్లీష్ విద్య ఇపుడు దేశానికి అవసరం

కులగణనసర్వే ప్రజంటేషన్ లో రాహుల్ గాంధీ



**హైదరాబాద్, మహా:** కులగణన నిర్వహించడం అంత తేలిక కాదని ఎంపీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ భవన్‌లో తెలంగాణలో జరిగిన కులగణన సర్వేపై కాంగ్రెస్ ఎంపీలు, నేతలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి కులగణన విజయవంతంగా చేపట్టారని, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు అంచనాలకు మించి రాణించారని కొనియాడారు. దేశంలో సామాజిక న్యాయానికి ఇదో మైలురాయిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆఫీసు రూముల్లో కూర్చుని కులగణన చేస్తే మంచి ఫలితాలు రావని, తెలంగాణ కులగణనలో దాదాపు 56 ప్రశ్నలు అడిగారని అన్నారు.

మిగతా 2లో



## కులగణన సర్వే నాకు ఆస్కార్ వంటిది

### సోనియమ్మ నన్ను మెచ్చుకుంటూ లేఖ రాసింది

రాహుల్ మాటే నాకు లక్ష్మణ రేఖ

రాహుల్, ప్రియాంక సమక్షంలో రేవంత్ రెడ్డి

**ఢిల్లీ, మహా :** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఇప్పటివరకు కులగణన జరగలేదని, తెలంగాణలో చేపట్టిన కులగణన సర్వే విజయవంతం కావడం ఆస్కార్ లబించడం లాంటిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. మొదట్లో జనగణనతో పాటు కులగణన చేసేందుకు కేంద్రం ముందుకు రాలేదని అన్నారు. తెలంగాణలో కులగణన సర్వే ప్రక్రియను తాము 2024లోనే ప్రారంభించామని గుర్తు చేశారు. తాను బీసీ నేతను అని ప్రధాని మోదీ పదేపదే చెప్పుకుంటున్నారని, ప్రధాని మోదీ లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని మరోసారి చెప్తున్నానని అన్నారు.

మిగతా 2లో




బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,00,970 |
| 22 క్యారెట్ | 92,550 |
| సిల్వర్ (కేజీ) | 1,18,000 |



### వచ్చే వారంలో అక్రిడిటేషన్ కార్డులపై నిర్ణయం

- ఆ వెంటనే హెల్త్ కార్డులు కూడా పంపిణీ చేస్తాం
- జర్నలిస్టులకు మంత్రి పొంగులేటి గుడ్ న్యూస్
- యూనియన్ నాయకులతో చర్చించి ఫైనల్ చేస్తాం
- జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్న మంత్రి

వివరాలు 3లో

స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 82,184.17 |
| నిఫ్టీ | 25,062.10 |

ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర


| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.5 | 135 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.8 | 135 |
| రిటైల్ గుడ్డు ధర | 4.77 | 143.1 |



### నేడే స్థానిక రిజర్వేషన్లు?

ముగియనున్న హైకోర్టు గడువు

కేంద్ర హోంశాఖ సలహా కోరిన జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్ ఆమోదం తెలిపితే రిజర్వేషన్లపై కీలక ప్రకటన?

నేడు కేబినెట్ సమావేశం


వివరాలు 2లో

ఆ సంఘటన కదిలించింది..

### వేలమందికి సైకిల్ అందించింది

- కేంద్ర మంత్రి బండి సంజయ్ బలమైన సంకల్పం
- మోదీ గిఫ్ట్ గా 20 వేల సైకిళ్ల పంపిణీ వెనక కారణమిదే
- 'మోదీ గిఫ్ట్'' సైకిళ్ల పంపిణీతో విద్యార్థుల్లో అంతులేని ఆనందం
- ప్రభుత్వ స్కూళ్లలో హాజరు శాతం పెరిగిందంటున్న అధ్యాపకులు
- శనివారం హుస్నాబాద్ నియోజకవర్గంలో 'మోదీ గిఫ్ట్' పేరుతో సైకిళ్ల పంపిణీ
- దేశంలో చర్చనీయాంశంగా మారిన కార్యక్రమం

వివరాలు 2లో




## హ్యాపీ బర్త్ డే కేటీఆర్

### దీవించిన కేసీఆర్.. రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు



**హైదరాబాద్, మహా:** తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తండ్రి కేసీఆర్ ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. భార్య శైలిమ, పుత్రుడు హిమాన్షుతో కలిసి ఎర్రవల్లి నివాసానికి ఆయన వెళ్లారు.

మిగతా 3లో



### గౌడ్‌జి ఆప్ బీసీ.. యాఓసి..

చమత్కరించిన ఖర్గే

తెలంగాణ నేతలతో సరదా సంభాషణ

వివరాలు 4లో



# ఆ సంఘటన కదిలించింది..
# వేలమందికి సైకిల్ అందించింది

## కేంద్ర మంత్రి బండి సంజయ్ బలమైన సంకల్పం

మోదీ గిఫ్ట్ గా 20 వేల సైకిళ్ల పంపిణీ వెనక కారణమిదే

'మోదీ గిఫ్ట్'' సైకిళ్ల పంపిణీతో విద్యార్థుల్లో అంతులేని ఆనందం

ప్రభుత్వ స్కూళ్లలో హాజరు శాతం పెరిగిందంటున్న అధ్యాపకులు

శనివారం హుస్నాబాద్ నియోజకవర్గంలో 'మోదీ గిఫ్ట్' పేరుతో సైకిళ్ల పంపిణీ

దేశంలో చర్చనీయాంశంగా మారిన కార్యక్రమం



**స్పెషల్ డెస్క్, మహా**

ఒక పథకం ప్రారంభించాలన్న.. బృహత్తర కార్యక్రమానికి బీజం పడాలన్నా ఎక్కడో ఓ గుండెను తడిమిన కుదిపిన జ్ఞాపకం ఉంటుంది. అలాంటి జ్ఞాపకమే.. అలాంటి బలమైన సంఘటనే 20 వేల మంది పేద విద్యార్థులకు ఒక ఆస్థిగా, ఒక అండగా.. బడి దారి చూపే ఆత్మీయస్పర్శ అయింది. సైకిల్ తొక్కుతూ స్కూల్ కు వెళ్లాలనే కోరిక బలంగా ఉన్నా కొనే స్థోమత లేక స్కూల్ మానేసి మానసిక బాధను అనుభవిస్తున్న ఓ పిల్లవాడి కోరికను నెరవేర్చిన క్షణాన ఆ పిల్లవాడు పొందిన ఆనందం, ప్రపంచాన్ని జయించినట్లుగా రెక్కలు విప్పిన సంతోషం చూసి కేంద్రమంత్రి బండి సంజయ్ చలించిపోయారు. ఒక సైకిల్ గ్రామీణ విద్యార్థులపై ఎంత బలమైన ముద్ర వేస్తుందో స్వయంగా చూసిన నేత.. ఆ మానవీయ స్పర్శ వేలాదిమందికి అందించాలని ఆ క్షణానే నిర్ణయించుకున్నారు.

### ఎవరా పిల్లాడు?

నిర్మల్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామమైన బామినిలో తల్లిదండ్రులను కోల్పోయి ముసలి అవ్వతో ఉంటూ అత్యంత పేదరికం అనుభవిస్తూ మానసిక రోగిగా మారిన 11 ఏళ్ల పిల్లాడు రాంచరణ్. దాదాపు 1650 కి.మీ.ల ప్రజాసంగ్రామ బండి సంజయ్ ఆ గ్రామానికి వెళితే ఆ ఇంటి తలుపు తట్టగా మొట్టమొదట కన్పించిన దృశ్యం ఆ పిల్లవాడి మానసిక స్థితి. అందరూ అతనిని పిచ్చోడిగా చూస్తే అతనితో మాట్లాడిన కాసేపటికే అతను పిచ్చోడు కాదు, సైకిల్ పై స్కూల్ కు వెళ్లాలనే కోరిక తీరక పిచ్చివాడిగా మారారని, సైకిల్ కొనిస్తే స్కూల్ కు వెళ్లి చదువుకుంటావా? అని అడిగితే ఆ పిల్లవాడు ఇచ్చిన జవాబు నేరుగా షాపుకు తీసుకెళ్లి సైకిల్ కొనిచ్చిన బండి సంజయ్ ను ఆ పిల్లవాడు అమ్మలా పెనవేసుకుని ముద్దుపెడుతూ చిందించిన చిరునవ్వు. బండి సంజయ్ మనసులో బలంగా నాటుకుపోయింది. దాని ఫలితమే రెండోసారి ఎంపీగా గెలిచిన వెంటనే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

### సామాన్యుల బాధలు తెలిసిన నాయకుడు

వాస్తవానికి బండి సంజయ్ స్వతహాగా ధనికుడు కాదు. సామాన్య కుటుంబం నుండి వచ్చి పట్టుదలతో ఎదిగిన నాయకుడు. హిందుత్వమే ప్రాణంగా బతుకుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ తన వద్దకు వచ్చే వాళ్లకు చేతనైనంత సాయం చేసేంతటి వ్యక్తిత్వం కలిగిన మానవత్వం పరిమళించే నాయకుడు . అందుకే ఆ పిల్లవాడి కళ్లల్లో ఆనందంతో ఎట్లాగైనా ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేద విద్యార్థులందరికీ సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేయాలని డిసైడ్ అయ్యారు. రెండోసారి ఎంపీ కావడం, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో తన వద్దకు వచ్చే పలు సంస్థలు, పారిశ్రామికవేత్తల సహకారంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ (సీఎస్సార్) ఫండ్స్ తో ''మోదీ గిఫ్ట్'' పేరుతో 20 వేలకు పైగా సైకిళ్లను కొనుగోలు చేసి తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల, శిశు మందిర్ స్కూళ్లలో పదవ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులందరికీ ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సైకిళ్ల పంపిణీలో ఎలాంటి అక్రమాలు, అవినీతి ఉండకూడదని, నేరుగా విద్యార్థులకే అందాలనే సంకల్పంతో జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ఏ ప్రభుత్వ పాఠశాలలో ఎంత మంది టెన్త్ చదివే విద్యార్థులున్నారు? గ్రామాలు, మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లాల వారీగా జాబితాను సేకరించి ఆ మేరకు సైకిళ్లను ఆయా పాఠశాలలకు పంపి విద్యార్థులకు అందజేసే బాధ్యతను అధికారులతోపాటు పార్టీ పక్షాన ఒక ప్రతినిధిపై ఉంచారు.

### నియోజకవర్గాల వారీగా...

ఈనెల 9న కరీంనగర్ నియోజకవర్గంలో, 15న సిరిసిల్ల జిల్లాలో, 17న హుజూరాబాద్ లో వేలాది సైకిళ్ల పంపిణీ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయ్యింది. శనివారం హుస్నాబాద్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆ జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ నియోజవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో, శిశు మందిర్ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ సైకిళ్లు అందజేసే కార్యక్రమం దాదాపుగా పూర్తయ్యింది. గత పక్షం రోజుల నుండి ఈ కార్యక్రమం ఆయా నియోజకవర్గాల్లో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సైకిళ్లు తీసుకున్న విద్యార్థులు ఏమంటున్నారు? ఆ సైకిల్ వల్ల ఏమైనా ప్రయోజనం కలుగుతోందా? హాజరు శాతంపై టీచర్లు ఏముంటున్నారు? అట్లాగే సైకిల్ పై స్కూల్ కు పంపుతున్న తల్లిదండ్రులు ఏమనుకుంటున్నారు? వారి మనోభావాలు ఎలా ఉన్నాయనే దానిపై కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి టెన్త్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కదిలిస్తే ఆశ్చర్యపోయే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

### దేశంలో ట్రెండింగ్

బండి సంజయ్ చేస్తున్న సైకిళ్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా కూడా ట్రెండింగ్ గా మారింది. తమకు కూడా సైకిళ్లు ఇవ్వాలంటూ తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ప్రజా ప్రతినిధులపైన, అధికారులపైనా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒత్తిడి తెస్తున్నారు. "ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదని, సీఎస్సార్ ఫండ్స్ తో బండి సంజయ్ సొంతంగా చేపట్టిన సేవా కార్యక్రమమని ఎంత చెప్పినా ప్రజలు వినడం లేదు. ఏం చేయాలో మాకు పాలుపోవడం లేదు"అంటూ పలువురు ఎమ్మెల్యేలతో పాటు ఇతర రాష్ట్రాల ఎంపీలు సైతం చెప్పడం గమనార్హం. నిజాయితీ నిబద్ధతతో ఏ పనిచేసినా ఫలితాలు ఎలా ఉంటాయనడానికి, ప్రజలు ఎంతలా గుర్తుపెట్టుకుంటారో చెప్పడానికి బండి ప్రారంభించిన మోదీ గిఫ్ట్ విజయమే నిదర్శనం.

### తగ్గిన డ్రాపవుట్స్.. ఇపుడు బడి అంటే పండుగ

"సార్... వాస్తవానికి మొన్నటి వరకు టెన్త్ విద్యార్థుల హాజరు సరిగా ఉండేది కాదు. స్పెషల్ క్లాసులకు కూడా హాజరయ్యే వాళ్లు కాదు. ప్రతి ఏటా ప్రభుత్వ స్కూళ్లలో డ్రాపవుట్స్ సంఖ్య పెరిగేది. సైకిళ్లు వచ్చాక టెన్త్ విద్యార్థుల్లో చాలా మార్పు వచ్చింది. రంచన్ గా స్కూల్ వస్తుండటంతో హాజరు శాతం చాలా మేరకు పెరిగింది. స్పెషల్ క్లాసులకు అటెండ్ అవుతున్నారు. డ్రాపవుట్స్ కూడా తగ్గాయి"అని ప్రభుత్వ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.



### బండి సంజయ్ సార్.. మీరు గ్రేట్

ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లతోపాటు సంబంధిత ఉన్నతాధికారులు, పోలీసులు, విద్యాశాఖ అధికారులంతా కేంద్ర మంత్రి బండి సంజయ్ ను అభినందిస్తున్నారు. "విద్యార్థుల మొట్ట మొదటి ఆస్తి సైకిల్. అట్లాంటి ఆస్తిని అందజేస్తున్న బండి సంజయ్ ను విద్యార్థులు ఎన్నడూ మర్చిపోలేరు"అని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. "సైకిల్ చదువుకే కాదు. వ్యాయమానికి కూడా ఎంతో ఉపయోగం. ఈరోజుల్లో వ్యాయమం లేకుండా అనారోగ్యాల బారిన పడుతున్న విద్యార్థులకు సైకిల్ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ విషయంలో కేంద్ర మంత్రి చేస్తున్న కృషి అభినందనీయం"అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వ్యాఖ్యానించడాన్ని పరిశీలిస్తే సైకిళ్ల పంపిణీ ఎంతటి చక్కటి ఫలితాలను ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు.

# రేవంత్ అంచనాలకు మించి రాణించారు

(మొదటిపేజీ తరువాయి)



దేశంలో కులగణన నిర్వహణకు ఇది మార్గదర్శిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**రిజర్వేషన్లపై 50శాతం పరిమితి ఎత్తేయాలి**

ఇండియాలో తెలంగాణకు ఉన్న స్థాయిలో డేటా మరే రాష్ట్రంలోనూ లేదని రాహుల్ గాంధీ అన్నారు. బిల్‌గేట్స్, ట్రంప్ ఎవరిని అడిగినా ఇదే చెబుతారని, తెలంగాణ వద్ద 21వ శతాబ్దపు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమాచారం ఉందని తెలిపారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేయాల్సిన అవసరం ఉందని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి పూర్తిగా బీజేపీ భావజాలమని, కులగణనను సరైన రీతిలో బీజేపీ సర్కారు చేయదని, దేశ అసలైన వాస్తవ చిత్రాన్ని బహిర్గతం చేయడానికి బీజేపీ ఇష్టపడదని విమర్శించారు. ధనం, భూమి ఎవరి చేతుల్లో ఉన్నాయో తెలిపే డాటా తెలంగాణ చేతిలో ఉందని పేర్కొన్నారు. సమాజాన్ని వేగంగా అభివృద్ధి చేసే శక్తి ఒక్క విద్యకే ఉందని, ఇంగ్లీష్‌లో విద్య ఇప్పుడు దేశానికి అత్యవసరమని తెలిపారు. హిందీ, ప్రాంతీయ భాషలు ముఖ్యం కాదని నేను చెప్పట్లేదని అన్నారు. బీజేపీ నేతలు మాత్రం ఇంగ్లీష్‌ను తీసేయాలని అంటున్నారని అన్నారు. బీజేపీ నేతలను అడగండి వారి పిల్లలు ఏ భాషలో చదువుతున్నారోనని, దళిత, ఆదివాసీల పిల్లలు ఇంగ్లీషులో ఎందుకు చదవకూడదని ప్రశ్నించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ , రాష్ట్రమంత్రులు కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పాల్గొన్నారు.

# కులగణన సర్వే నాకు ఆస్కార్ వంటిది

(మొదటిపేజీ తరువాయి)



మోదీకి బీసీలపై నిజమైన ప్రేమ లేదని ఆరోపించారు. సోనియా గాంధీ తనను మెచ్చుకుంటూ లేఖ రాసిందని, ఇది తనకు ఆస్కార్ అవార్డ్, నోబెల్ బహుమతి, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ లాంటిదన్నారు. తాను ఎన్ని అభివృద్ధి, సంక్షేమ పనులు చేసినా, వేరే కుర్చీలో కూర్చున్నా, వీటన్నిటికంటే సోనియా గాంధీ రాసిన ఈ లేఖే తనకు గొప్ప అన్నారు.

**రాహుల్ భయ్యా బంగారు గీత**

నీది కాంగ్రెస్ పార్టీ కాకపోయినా సీఎం సీట్ ఎలా దక్కిందని అందరూ అడుగుతుంటారు. రాహుల్ భయ్యాతో నా ఆత్మ కలిసింది.. రాహుల్ భయ్యా మనసులో ఉన్న పని చేయాలని నేను డిసైడ్ అయ్యాను. నా అధినేత రాహుల్ భయ్యా ఏదైనా చెప్పాడంటే అది నాకు బంగారు గీత అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులగణన అన్నది రాహుల్ కల అని, ఆ మోడల్ ను తమ రాష్ట్రంలో విజయవంతంగా చేసి మార్గదర్శిగా నిలిచామన్నారు. ఇది తెలంగాణ మోడల్ కాదని, రేర్ మోడల్ అన్నారు. రాహుల్ గాంధీ హామీని తాము నెరవేర్చామన్నారు. కొన్ని విషయాల్లో మోదీ సర్కార్ దిగివచ్చేలా రాహుల్‌గాంధీ పోరాటం చేశారని, అందువల్లే మూడు రైతుచట్టాలను ప్రధాని రద్దు చేశారని అన్నారు. తెలంగాణలో సామాజిక, ఆర్థిక, కుల, విద్య, రాజకీయ సర్వే సమగ్రంగా జరిగిందని తెలిపారు. తెలంగాణలో జరిగిన సమగ్ర సర్వే డేటా 88 కోట్ల పేజీల్లో నిక్షిప్తమైందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేశామని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని, ప్రతి సామాజికవర్గానికి న్యాయం చేసేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని అన్నారు. కులగణన సర్వేలో తెలంగాణ ప్రభుత్వం అరుదైన విధానం అవలంభించిందని, దేశానికే దిక్సూచిగా నిలిచే విధానంలో కులగణన సర్వే చేశామని అన్నారు.



# ఇండియన్స్‌కు నో జాబ్స్

## చైనాలో కంపెనీలు, ఇండియన్స్ కు ఉద్యోగాలా?

అమెరికన్ టెక్ కంపెనీలకు ట్రంప్ వార్నింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఆ సమయంలో కృత్రిమ మేధస్సుకు సంబంధించి మూడు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా టెక్ పరిశ్రమలో ఎక్కువ భాగం రాడికల్ గ్లోబలిజాన్ని అనుసరించిందని, ఇది లక్షలాది మంది అమెరికన్లకు చేసిన ద్రోహంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. "మన అతిపెద్ద టెక్ కంపెనీలు చాలా వరకు చైనాలో తమ ఫ్యాక్టరీలను నిర్మిస్తూ, భారతీయులను ఉద్యోగులుగా నియమించుకుంటూ, ఐర్లాండ్‌లో లాభాలను తగ్గించుకుంటూ అమెరికా మెప్పు పొందాయి. ఇది మీకు తెలుసు. అదే సమయంలో ఇక్కడ తమ తోటి పౌరులను తొలగిస్తున్నారు. అందుకే అధ్యక్షుడు ట్రంప్ పాలనలో ఇక ఆ రోజులు ముగిశాయి" అని ఆయన అన్నారు. "మాకు అమెరికా టెక్నాలజీ కంపెనీలు మద్దతు ఇవ్వాలి. మీరు అమెరికాను మొదటి స్థానంలో నిలపాలని మేం కోరుకుంటున్నాం. మీరు అలా చేయాల్సిందే. మేం అడుగుతున్నది అదే" అని ట్రంప్ తెలిపారు.

# నేడే స్థానిక రిజర్వేషన్లు?

## ముగియనున్న హైకోర్టు గడువు

కేంద్ర హోంశాఖ సలహా కోరిన జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్ ఆమోదం తెలిపితే రిజర్వేషన్లపై కీలక ప్రకటన?.. నేడు కేబినెట్ సమావేశం



**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు శుక్రవారం ఖరారయ్యే అవకాశం ఉంది. హైకోర్టు విధించిన గడువు నేటితోముగుస్తుంది. రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వం హైకోర్టుకు తెలపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను డెడికేటెడ్ కమిషన్ నుంచి తీసుకొని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ కేబినెట్ చేసిన ఆర్డినెన్స్ ప్రస్తుతం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వద్ద ఉంది. ఆయన దానిపై న్యాయ నిపుణులతో చర్చించారు. తనకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అదే తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులతోనూ ఆయన మాట్లాడారు. తెలంగాణ అడ్వొకేట్ జనరల్‌తోనూ చర్చించారు. ఫైనల్‌గా మరో మారు న్యాయసలహా కోసం కేంద్ర హోంశాఖకు పంపిచారు. దీంతో ఆర్డినెన్స్‌పై ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చే అంశంపై కేంద్రం సైతం ఇంత వరకు ఎలాంటి ముందడుగూ వేయలేదు. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకుల ప్రకటనలు పరిశీలిస్తే ఈ విషయం ఇప్పట్లో తేలదని స్పష్టమవుతోంది. మరోవైపు శుక్రవారం తెలంగాణ కేబినెట్ కూడా సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

**కేంద్ర హోంశాఖకు...**

ఇప్పటి వరకు బీసీలకు స్థానిక సంస్థల్లో 22% రిజర్వేషన్ మాత్రమే ఉంది. కులగణన చేపట్టిన ప్రభుత్వం 46శాతానికి పైగా బీసీలున్నట్టు తేల్చింది. ఈ క్రమంలో స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం చూస్తే.. అన్ని రిజర్వేషన్లు కలుపుకొని 50 శాతానికి లోబడి ఉండాలి. అందులో యాభై శాతానికి లోబడి అనే పదాన్ని తొలగిస్తూ ఈ నెల 10న కేబినెట్ తీర్మానం చేసి ఆర్డినెన్స్ రూపంలో గవర్నర్ కు పంపింది. ఆయన న్యాయసమీక్ష చేస్తున్నారు. నిపుణులతోనూ చర్చించారు. ఇవాళ ఫైనల్‌గా కేంద్ర హోంశాఖ కు న్యాయ సలహా కోసం పంపించడం గమనార్హం. గవర్నర్ ఆర్డినెన్స్ పై సంతకం చేయగానే ఏ వర్గానికి ఎంతశాతం రిజర్వేషన్లు అనేది ఖరారు చేస్తూ హైకోర్టుకు ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయనుంది. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలయితే భారీగా మార్పులుండే అవకాశం ఉంది. గవర్నర్ ఆమోదం తెలిపితే రేపే రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది.

**గవర్నర్ నిర్ణయమే కీలకం**

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఈ నెల 10న రాష్ట్ర కేబినెట్ పంపిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేయాల్సి ఉంది. ఆయన సంతకం చేయకపోతే రిజర్వేషన్ల అంశం మరోమారు అటకెక్కే అవకాశం ఉంది. ఈ లెక్కన పాత పద్ధతిలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయి. కాంగ్రెస్ పార్టీగా ప్రకటించే అభ్యర్థుల వరకు రిజర్వేషన్‌ను అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే పార్టీ ప్రకారం రిజర్వేషన్లు కేటాయిస్తే కాంగ్రెస్ టికెట్లు 42 శాతం బీసీలకు ఇస్తుంది.

# కుమ్మక్కు రాజకీయాలు

## అవినీతి జరిగిందంటూనే రక్షిస్తున్నారు.. బీజేపీ ఎంపీ డికె అరుణ ఫైర్

**హైదరాబాద్, మహా:** బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ - కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాల అసలైన రూపం బయటపడిందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇందులో అనేక అంశాలపై తనదైన శైలిలో వివరించారు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే 'హైడ్ అండ్ సీక్' రాజకీయ నాటకం కొనసాగుతోందని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఫోన్ ట్యాపింగ్, వ్యక్తిగత నిఘా, గోప్యత ఉల్లంఘనలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపణలు చేశారన్నారు. తనతో పాటు తన కుటుంబం ఫోన్లు ట్యాపింగ్‌కు పాల్పడ్డారని మాట్లాడారని, కానీ, ఇప్పుడు ఆయన అవన్నీ మరిచినట్టుగా ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటే తనకు నోటీసులు వచ్చేవి కదా అనే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు.అలాంటప్పుడు గతంలో రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నాటకమా..? లేక ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీతో కుదిరిన ప్యాకేజీ డీలే కారణమా..? అనే అనుమానం కలుగుతోందని అన్నారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ప్యాకేజీ బేరాలు కుదిరాయనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీలు ప్రజల ముందు కేవలం మాటల యుద్ధం చేసుకుంటూ కుమ్మలాటలు చేసుకుంటూ, చీకట్లో ప్యాకేజీలు కుదుర్చుకుంటున్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంపై ఇప్పటికే కేంద్ర వ్యవస్థలు సంచలన విషయాలను బయటపెట్టాయన్నారు.

**19 నెలలుగా దర్యాప్తు పేరుతో కాలయాపన**

ఈ విషయంలో నాడు పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం వేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసి.. అధికారంలోకి వచ్చాక అదే బీఆర్ఎస్ పార్టీకి రక్షణ కవచంగా మారారన్నారు. రూ. 38,000 కోట్లతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ. 1.2 లక్షల కోట్లకు పెంచిన సంగతి తెలిసిందేనని, వేల కోట్లు వృథా చేసినట్లు కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు స్పష్టంగా పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టులో టెండర్ల మంజూరు, పునర్నిర్మాణ ఖర్చులు, నిర్మాణ వైఫల్యాలపై సంపూర్ణ విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అడుగైనా ముందుకు వేయకుండా, ఈ కేసును నీరుగార్చే కుట్రలకే పాల్పడుతోందన్నారు. గత 19 నెలలుగా కాళేశ్వరం అవినీతి దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తూ.. అసలు దోషులను అరెస్ట్ చేయకుండా విమర్శలకే పరిమితమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో సీబీఐ విచారణకు కోరి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.



# ఎవరికీ బెదిరేది లేదు

## విజయోత్సవంలో పవన్ కల్యాణ్

### తొలిరోజే 80 కోట్ల వీరమల్లు

**మహా:** ఈ సినిమాను కొంతమంది బాయ్‌కాట్ చేస్తాం అంటున్నారు.. ఎస్ చేయండి.. నేను పెద్దస్థాయికి ఎదిగాను అనుకుంటాను. ఎవరికీ బెదిరేది లేదని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. హరిహరవీరమల్లు సక్సెస్ సెలబ్రేషన్స్ లో ఆయన పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పాజిటివ్ టాక్ తో తొలిరోజే 80కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టిన హరిహరవీరమల్లు పై పవన్ తన అచీవ్ మెంట్ అంటూ సహకరించిన వారికి అభినందనలు తెలిపారు. 'నేను హరి హర వీర మల్లు సినిమాలో అన్నింటిని అడ్రెస్ చేయటం బిగ్గెస్ట్ ఎచీవ్‌మెంట్. నేను కలెక్షన్స్ దగ్గర ఆగిపోను. సినిమా అనేది ఇంపాక్ట్ .. ఎలా అది మనతో కనెక్ట్ అవుతుందనేది ఇంపార్టెంట్. హరిహర వీరమల్లు అది రీచ్ అయింది. ఈ సినిమాకు వచ్చిన ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం. హరి హర వీర మల్లు పార్ట్ 2 విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాం. అభిమానులు సెన్సిటివ్‌గా ఉండకండి.. హ్యాపీగా మీ జీవితాన్ని ఆస్వాదించండి. ఈ సినిమా నాదో రత్నందో మాత్రమే కాదు.. ఇది మన దేశ చరిత్రకు సంబంధించింది. కోహినూర్ పగిలినా పర్లేదు.. మన దేశ సాంస్కృతిక సంపద వారసత్వం కొనసాగటం అవసరం. ఇలాంటి ఒక సినిమా చేసినందుకు గర్వంగా ఉంది. హరిహర డే 1 ఓవరాల్‌గా వరల్డ్ వైడ్ రూ.7080 కోట్ల (గ్రాస్) మార్క్ టచ్ చేయవచ్చని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

# తెలంగాణలో సామాజిక న్యాయం 2.0

## బలహీన వర్గాల కోసమే ఈ పోరాటం

- ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ అంగీకారం
- దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలి
- ఎక్స్ వేదికగా ఏఐసీసీ చీఫ్ ఖర్గే కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో మెజారిటీగా ఉన్నా.. కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యా సంస్థల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



### ప్రజల ఒత్తిడికిలోనై మోదీ..

బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని ఖర్గే నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని స్పష్టం చేశారు. దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా.. కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తు చేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కుల గణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని, కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించలేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.

# వచ్చే వారంలో అక్రిడిటేషన్ కార్డులపై నిర్ణయం

- ఆ వెంటనే హెల్త్ కార్డులు కూడా పంపిణీ చేస్తాం
- జర్నలిస్టులకు మంత్రి పొంగులేటి గుడ్ న్యూస్
- యూనియన్ నాయకులతో చర్చించి ఫైనల్ చేస్తాం
- జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్న మంత్రి



**వైరా, మహా:** రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. జర్నలిస్టులకు సంబంధించిన కీలకమైన మూడు ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే జర్నలిస్ట్‌లకు కొత్త అక్రిడిటేషన్లు ఇస్తామని ప్రకటించారు. గురువారం ఖమ్మం జిల్లాలోని వైరాలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాల్గో జిల్లా మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వచ్చే వారంలో అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో యూనియన్ నాయకులతో చర్చించి ఫైనల్ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చిన తర్వాత వెంటనే హెల్త్ కార్డులు ఇస్తామని వెల్లడించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి సుప్రీంకోర్టులో ఉండటంతో న్యాయ నిపుణులతో చర్చించి ఎలాంటి ఆటంకం కలగకుండా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని మాటిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఉద్ఘాటించారు. జర్నలిస్టులకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

**దొరల పాలన పోయి ప్రజా పాలన..**

ప్రజాస్వామ్య దేశంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే జర్నలిజాన్ని, జర్నలిస్టులను కాపాడుకుంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రావడంలో జర్నలిస్టుల కృషి మరువలేనిదని కొనియాడారు. జర్నలిస్టుల శక్తివంచన లేని కృషి, ప్రజల ఆశీర్వాదంతోనే దొరల పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని కామెంట్స్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర అసాధారణమైనదని, పోరాడి సాధించుకున్నతెలంగాణలో జర్నలిస్టుల పరిస్థితి ఏంటో తెలుసు, బీఆర్ఎస్ పాలనలో జర్నలిస్టులకు వాక్ స్వాతంత్ర్యం కూడా లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో నిజాన్ని నిర్భయంగా రాసినందుకు జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. జర్నలిజం గౌరవప్రదమైన వృత్తి, ఈ సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను వెలికి తీసేదే జర్నలిస్టులని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులకు 18 ఏళ్ల క్రింద ఇచ్చిన భూమి సమస్యల్లో ఉంటే సీఎం రేవంత్, తాను కలిసి ప్రత్యేక చొరవ తీసుకుని క్లియర్ చేయించామని, కానీ సుప్రీం కోర్టు ఆర్డర్ తో పూర్తి చేయలేకపోయామన్నారు.

# పెన్షన్ పంపిణీలో కొత్త టెక్నాలజీ

- లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా నిర్ణయం
- అధికారులు పెన్షనర్ల కష్ట సుఖాలు తెలుసుకోవాలి
- అనర్హులు పెన్షన్ తీసుకుంటే పేదవారికి అన్యాయం చేసినట్లే
- చేయూత పెన్షన్ల పంపిణీపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్, మహా:** మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. పెన్షన్‌ల పంపిణీలో కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా పెన్షన్ అందించేందుకు నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. పింఛన్లు అందించడం సామాజిక బాధ్యత అని ఉద్ఘాటించారు. చేయూత పెన్షన్ల పంపిణీపై ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ రివ్యూకి సెర్ప్ సీఈవో దివ్యా, దేవరాజన్, డైరెక్టర్ గోపి, జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. పేదరిక నిర్మూలన కోసం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరా మహిళా క్యాంటీన్‌లు ఇస్తున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.15 సంవత్సరాల వయస్సు నుంచే మహిళా సంఘాల్లో సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం బాగుపడుతుందని ఉద్ఘాటించారు.

**ఆలస్యం అయితే ముందే సమాచారం ఇవ్వాలి..**

ఆర్టీసీలో 200 కోట్ల మహిళా ప్రయాణాలు జరిగాయంటే మహిళలకు ఫ్రీ బస్సు బాగా ఉపయోగపడుతోందని స్పష్టం చేశారు. మహిళలు ఫ్రీ బస్సు ఎక్కడమే కాదని.. మహిళలను బస్సు ఓనర్లను చేసింది తమ ప్రభుత్వమేనని ఉద్ఘాటించారు. పేదరికం తగ్గించకపోతే సమాజంలో అంతరాలు పెరుగుతాయని చెప్పుకొచ్చారు. నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు చేరే విధంగా అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించారు. అనర్హులు పెన్షన్ తీసుకుంటే పేదవారికి అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. సాంకేతిక కారణాలతో పింఛన్లు ఆలస్యం అయితే ముందే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫేషియల్ రికగ్రైజేషన్ ద్వారా అర్హులకే పింఛన్లు అందుతోందని స్పష్టం చేశారు. ప్రతీ నెల రూ.1000 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. పిల్లలు వదిలేసిన తల్లిదండ్రులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షనే చేయూత అని.. అదే వారి ధైర్యమని ఉద్ఘాటించారు. ఈ క్రెడిట్ అంతా ఐఏఎస్ దివ్యాకే దక్కుతుందని... అలాగే ప్రతీ అధికారి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అధికారులూ పెన్షనర్ల కష్ట సుఖాలు తెలుసుకోవాలని, మానవ సేవే మాధవ సేవ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

### అక్రిడేషన్ కార్డుల జారీకి ముందే

# పత్రికలను ఎంపానల్ చేయండి

- చిన్న పత్రికల నిర్వహణ గగనంగా మారుతోంది
- తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం

**వరంగల్, మహా :** గత 11 సంవత్సరాల నుండి దాదాపు 300 పత్రికల వరకు ఎం ప్యానల్ మెంట్ నోచుకోలేక పేపర్ నిర్వహించడం గగనంగా మారుతున్నా ఇప్పటివరకు ఎంపానల్ చేయకుండా అక్రిడేషన్ జారీ చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని చిన్నపత్రికల సంఘం పేర్కొంది. పత్రికారంగానే అణగదొక్కడానికి గత కెసిఆర్ ప్రభుత్వం అనేక విధాలుగా ప్రయత్నించింది సఫలమైందని, ఇపుడు ఈ సర్కార్ సైతం చిన్న పత్రికలపై కక్ష సాధింపు చర్యలు చేస్తుందని దానికి సమాచార శాఖ మంత్రి సై అనడం పలు అనుమానాలకు తావిస్తోందని సంఘం పేర్కొంది. ఎం పానెల్మెంట్ చేయక రేటు కార్డు ఇవ్వక చిన్న పత్రికల నిర్వహణ చేయడం చాలా ఇబ్బందికరంగా మారిందని , జర్నలిజం పిచ్చిలో చాలామంది ఇలా పత్రికల నిర్వహించుకుంటూ అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చిన్న పత్రికలను ఎం పానెల్మెంట్ చేసి ఒక్కొక్క జిల్లాకు ఒక్కొక్క అక్రిడేషన్ కార్డు చొప్పున ఇవ్వడంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలలో ఆరు చొప్పున అక్రిడేషన్ కార్డుల జారీ చేస్తే వాళ్లకు ఎంతో ఊరట కలుగుతుందని దీనిపై తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం కూడా పలుసార్లు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకువచ్చినా ఇప్పటివరకు స్పందించకపోగా ఇప్పుడు అక్రిడేషన్ కార్డులు జారీ చేస్తామని చెప్పడం విడ్డూరంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి చిన్న పత్రికలను ఎంపానెల్ మెంట్ చేసిన తర్వాతనే అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని చిన్న పత్రికలకు మంచి రేట్ కార్డు ఫిక్స్ చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.



# హ్యాపీ బర్త్ డే కేటీఆర్

## దీవించిన కేసీఆర్

**రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు**

**(మొదటిపేజీ తరువాయి)**

ఈ సందర్భంగా కుమారుడిని ఆశీర్వదించిన కేసీఆర్.. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుంట్ల కవిత కూడా తన సోదరుడు కేటీఆర్ కు సోషల్ మీడియాద్వారా 'అన్నయ్య..మెనీ మోర్ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే' అంటూ సింపుల్ గా విషెస్ చెప్పారు. కేటీఆర్ బర్త్ డే సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయన పుట్టిన రోజు వేడుకల్ని ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ భవన్ లో కేటీఆర్ కేకు కట్ చేశారు.

**ఫిలింనగర్ లో హోమం**

ఫిలింనగర్ దైవసన్నిధానంలో కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఖైరతాబాద్ బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి దంపతులు ప్రత్యేక హోమం నిర్వహించారు. కేటీఆర్ నిండునూరేళ్ళు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆశీర్వదించారు.

# పట్నంలో మరో ఐకానిక్ వంతెన

## భాగ్య నగర సిగలో అద్భుత నిర్మాణం

- మీరాలం చెరువుపై వంతెనకు రూ.430 కోట్లు కేటాయింపు
- శాస్త్రిపురం నుంచి బెంగళూరు హైవేను కలపనున్న బ్రిడ్జి
- నాలుగు లైన్లతో 2.65 కిలోమీటర్ల పొడువుతో ఈ హైలెవల్‌తో పనులు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగర వాసులకు గుడ్‌న్యూస్. ప్రస్తుతం దుర్గం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మించి పర్యాటకులను ఆకర్షిస్తుండగా.. మరో కేబుల్ బ్రిడ్జిని నిర్మించేందుకు రేవంత్ ప్రభుత్వం రెడీ అయింది. మీరాలం చెరువుపై ఐకానిక్ వంతెన కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ వంతెన నిర్మాణానికి రూ.430 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. శాస్త్రిపురం నుంచి బెంగళూరు హైవేను కలుపుతూ ఈ ఐకానిక్ వంతెన నిర్మాణం జరగనుంది.హైదరాబాద్ పాతబస్తీకి సమీపంలోని మీరాలం చెరువును టూరిస్ట్ హబ్‌గా మార్చేందుకు హెచ్‌ఎండీఏ ప్రణాళికలు రచిస్తోంది. అవసరమైన పరిపాలన అనుమతులు రావడంతో మిరాలం ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ రూపకల్పనకు అధికారులు కసరత్తు ప్రారభించారు. మీరాలం లేక్ ఫ్రంట్ పార్కు అభివృద్ధితో పరిసర ప్రాంతాలు ఆకర్షణీయంగా మారనున్నాయి.



నాలుగు లైన్లతో 2.65 కిలోమీటర్ల పొడువుతో..


మీరాలం చెరువు కేబుల్ బ్రిడ్జిని దుర్గం చెరువు తరహాలోనే నిర్మించనున్నారు. రెండేళ్లలో ఈ నిర్మాణం పూర్తి చేసేలా హెచ్‌ఎండీఏ ఓ కన్సల్టెన్సీ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రూ.430 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. మీరాలం ట్యాంక్ ఈస్ట్ సైడ్‌లో ఉన్న చింతల్‌మెంట్ రోడ్డు నుంచి ట్యాంక్ తూర్పున గల బెంగళూరుహైదరాబాద్ నేషనల్ హైవే 44ను కనెక్ట్ చేస్తూ బ్రిడ్జి నిర్మించనున్నారు. మొత్తం నాలుగు లైన్లతో 2.65 కిలోమీటర్ల పొడువుతో ఈ హైలెవల్ ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. వంతెన పైన రెండు చోట్ల 140 మీటర్లతో ప్రవేశానికి ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. ఒక చోట 110 మీటర్లతో ఎగ్జిట్ ర్యాంప్ ఏర్పాటు చేస్తారు. అలాగే కేబుల్ బ్రిడ్జిపై ఆకర్షణ కోసం అర్నమెంటల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు. కేబుల్ బ్రిడ్జి సమీపంలోనే ల్యాండ్ స్కేప్ డెవలప్‌మెంట్, టూరిజానికి అనుగుణంగా సందర్శకులను ఆకట్టుకునేందుకు వ్యూ పాయింట్లు, సంస్కృతి, వారసత్వ నేపథ్యాన్ని తెలియజేసేందుకు వివిధ అభివృద్ధి పనులు, సమాచార కేంద్రాలు ఏర్పాట చేసేందుకు హెచ్‌ఎండీఏ రెడీ అయింది.

# ఘనంగా తీజ్ పండుగ

## బంజార మహిళలతో నృత్యం చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామం కెవుల తండాలో గురువారం బంజారాల తీజ్ పండుగ వేడుకలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని వారితో కలిసి నృత్యం చేశారు. గిరిజనులు సంప్రదాయ దుస్తువులతో నృత్యం చేస్తూ అందరిని ఆకర్షించారు. నవ ధాన్యాలను బుట్టలో వేసి తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి దానిని తలలో పెట్టుకుని ఊరేగింపు చేస్తారు. ఈ పండుగ లో బీర్ల అయిలయ్య పాల్గొని వారితో కలిసి డాన్స్ చేశారు.





### ప్రభుత్వ ఉద్యోగులకు

# బిగ్ రిలీఫ్!

- పంచాయతీ రాజ్ శాఖలో పెండింగ్ జీతాలు విడుదల
- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట
- 12,055 ఉద్యోగుల సేవలను మరో ఏడాది పొడిగించిన సర్కార్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఫిక్స్‌డ్ టెన్యూర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సేవలందిస్తున్న 12,055 మంది ఉద్యోగుల సేవలను మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు వారి సేవలను పొడిగిస్తూ అధికారికంగా జీవో (ప్రభుత్వ ఉత్తర్వులు) జారీ చేసింది. సేవల పొడిగింపు జరగకపోవడంతో గత మూడు నెలలుగా ఈ ఉద్యోగుల జీతాలు సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి. దీనితో వేతనాలు అందక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ఇప్పుడు జీవో జారీ కావడంతో వారి మూడు నెలల పెండింగ్ జీతాల ప్రాసెసింగ్ ప్రక్రియ పూర్తయింది. ఆర్థిక శాఖ నుంచి పంచాయతీ రాజ్ శాఖకు నిధులు కూడా చేరాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల నిర్ణయంతో, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు ఒకటి, రెండ్రోజుల్లో ఉద్యోగుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ నిర్ణయం వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రతను అందించడంతో పాటు, వారికి పెద్ద ఊరట కల్పించింది. ప్రభుత్వ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ఉద్యోగుల సేవలను గుర్తించి ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఒక్క కంకికి 1000 గింజలు.. ఎకరానికి 10 టన్నుల దిగుబడి

# కొత్త వంగడం వచ్చేస్తోంది!

- అధిక దిగుబడినిచ్చే వరి వంగడం అభివృద్ధి దిశగా పరిశోధనలు
- వరిలో కొత్త చరిత్ర దిశగా ప్రస్తుత రకాలతో పోల్చితే రెట్టింపు ఉత్పత్తి
- 2027 డిసెంబర్‌లోగా అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు

**హైదరాబాద్, మహా:** ఆరుగాలం ఎంతో శ్రమపడి పండించిన పంట చివరికి చేతికొచ్చేసరికి తగిన దిగుబడి రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్న రైతులెందరో. కానీ ఇకపై అలాంటి అవసరం ఉండకపోవచ్చు. మీ కోసమే భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కొత్త తరహా వంగడాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దీని ప్రత్యేకత ఏంటంటే చీడపీడలను తట్టుకుని వరి దిగుబడిని పెంచడమే. అసలేంటి ఆ కొత్త రకం విత్తనం? మరి వాటి ప్రత్యేకతలేంటో ఇప్పుడు తెలుసుకుందాం

సరికొత్త వంగడం అభివృద్ధి :ఒక ఎకరం భూమిలో సాధారణ రకం వరి విత్తనాలు వేస్తే ఇటీవల కాలంలో కంకికి 150200 వడ్ల గింజలు దిగుబడి వస్తుంది. మొత్తం సుమారుగా 2 నుంచి 2.5 టన్నుల వరి దిగుబడి వస్తోంది. గత సంవత్సరం అక్టోబరు నెలలో విడుదలైన డీఆర్ఆర్ ధాన్ 75, 76 రకాల్లో వరి కంకికి 450500 గింజలు వస్తున్నాయి. వీటి ద్వారా 3.5 నుంచి 4.5 టన్నుల మేరకు దిగుబడి వస్తోంది. భారత వరి పరిశోధన సంస్థ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్)లో దీనికి రెట్టింపు స్థాయిలో వరి కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి 10 టన్నుల మేరకు భారీ ఉత్పత్తి సాధించే దిశగా ఈ కొత్త వంగడం సిద్ధమవుతోంది. వీటిపై ప్రాథమిక ప్రయోగాలు పూర్తయ్యాయి. తుది ఫలితాల అనంతరం మరో రెండు సంవత్సరాల్లో ఈ రకం వంగడాలు అందుబాటులోకి తీసుకురానుంది. హైబ్రిడ్‌లో కాకుండా సంప్రదాయ రకాల కలయిక ద్వారా ఈ సంస్థ సైంటిస్ట్‌లు కొత్త రకాన్ని సృష్టిస్తున్నారు. తక్కువ కాలవ్యవధిలో సాగయ్యే సన్న రకంగా తెగుళ్లను తట్టుకునే విధంగా ఉండటం వీటి ప్రత్యేకత. గ్లూకోజ్ శాతం తక్కువ ఉండేవిధంగా దీన్ని రూపొందిస్తున్నారు.

"కంకికి వెయ్యి గింజలతో ఎకరం విస్తీర్ణం గల భూమిలో పది టన్నులు పండే వరి వంగడం 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలని సంకల్పించాం. దీనికి అనుగుణంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కొత్త వంగడం వరిలో హిస్టరీ క్రియేట్ చేస్తుంది. ప్రస్తుతం చైనా దేశంలో హైబ్రిడ్ వరి ఎకరానికి 6 టన్నులు వస్తోంది. మేం రూపొందిస్తున్న వరి వంగడం దాన్ని అధిగమిస్తుంది. రైతులకు ఉత్పాదకతను, దేశానికి ఆహారభద్రతను కూడా రెట్టింపు చేస్తుంది. కొత్తరకం విత్తనోత్పత్తికీ అనుకూలం"

### ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు

ఇక్రిశాట్ ర్యాపిడ్ రాగి :మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ఎదురవుతున్న అనేకరకాల సమస్యలకు సంపూర్ణ పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు (మిల్లెట్స్) పరిష్కార మార్గంగా మారాయి. క్రమేణా మిల్లెట్ల వినియోగం పెరుగుతుండటం వల్ల రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఊదలు, సామలు, అరికెలను మరింతగా వినియోగంలోకి తెచ్చేందుకు విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇక్రిశాట్ (అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ) రాగులపై విస్తృత పరిశోధనలు చేసి, 'ర్యాపిడ్ రాగి' అనే పేరుతో ఓ కొత్త వంగడాన్ని అభివృద్ధి చేసింది.

ప్రయోజనాలెన్నో :మనదేశంలో జొన్న, సజ్జల తర్వాత 3 అత్యంత ముఖ్యమైనటువంటి చిరుధాన్యంగా రాగి పంట గుర్తింపు పొందింది. పొరుగు రాష్ట్రమైన ఏపీలో లక్ష ఎకరాల్లో, తెలంగాణలో 13,000 ఎకరాల్లో సాగవుతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్నటువంటి వంగడాలతో పంట కాలం 135 రోజులుగా ఉండటంతో ఏడాదికి రెండు పంటలు మాత్రమే సాధ్యమవుతున్నాయి.

### భారీ వర్షాల నేపథ్యంలో


# ఆర్ అండ్ బీ సిబ్బంది సెలవులు రద్దు

## మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** గడచిన రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సూపరిండెంట్ ఇంజనీర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లోనే అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలో ఈఈ, డీఈ,ఏఈలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ప్రతి నాలుగైదు గంటలకు ఒకసారి ఆయా ఏరియాల్లో పరిస్థితులపై సమీక్ష చేసుకోవాలనీ ఆదేశించారు. హైదరాబాద్ నుండి ఈఎన్సీ, సీఈలు మానిటరింగ్ చేస్తూ తనకు అప్డేట్ ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. కల్వర్టులు, బ్రిడ్జీలు, నిర్మాణంలో ఉన్న రోడ్ల వద్ద రెగ్యులర్ చెకప్ చేయాలని, పొంగిపొర్లే వాగులపై ఉన్న బ్రిడ్జిలను తరచూ పరిశీలించాలని సూచించారు. వరద వల్ల కోతకు గురైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన వెంటనే పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీ రాజ్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఫీల్డ్ లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పరిష్కరించుకోవాలన్నారు. బలమైన ఈదురు గాలితో వచ్చే వానల వల్ల రోడ్లను అనుకోని ఉన్న ఎలక్ట్రిక్ పోల్స్ రోడ్ల మీదుగా వెళ్లే హైటెన్షన్ వైర్లు వల్ల కూడా ప్రమాదం ఏర్పడే ఆస్కారం ఉందని, ఎక్కడైనా అట్లాంటివి ఉంటే ముందుగానే గుర్తించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. నదులు, వాగుల వెంట, చెరువు కట్టల కింద ఉన్న రోడ్లు ఊహించని భారీ వరద ప్రవాహానికి దెబ్బతినే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ అధికారులతో టచ్ లో ఉంటూ వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడటంతో పాటు రోడ్లపై ప్రయాణించే వారిని అప్రమత్తం చేయాలన్నారు. పోలీస్ యంత్రాంగం సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని, అత్యవసరమైతేనే ప్రజలు రోడ్ల పైకి రావాలని కోరారు. వరదలకు రోడ్డు పాడైతే ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తిరిగి వెంటనే రీస్టోర్ చేస్తామని, ప్రజలు కూడా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఆర్ అండ్ బి అధికారి ఫీల్డ్ లో ఖచ్చితంగా ఉండాలనీ అత్యవసరమైతే తప్ప సెలవుపై వెళ్లొద్దని మంత్రి స్పష్టం చేశారు.

# ప్రపంచంలోనే ఎత్తైన భవనం..
## కోట్లు పెట్టి కొనేసిన మన తారలు వీళ్లే!

బుర్జ్ ఖలీఫా.. ఈ పేరు తెలియని వారు దాదాపు ఉండరు. దుబాయ్‌లోని ఆకాశసౌధం ప్రపంచంలోనే ఎత్తైన భవనంగా గుర్తింపు పొందింది. దుబాయ్ ట్రిప్ వెళ్లినవారు అక్కడ తప్పకుండా ఫోటోలు తీసుకోకుండా ఉండలేరు. అంతలా పర్యాటకంగా బుర్జ్ ఖలీఫా ఫేమస్ అయింది. అయితే ఇది కేవలం పర్యాటక ప్రాంతం మాత్రమే అనుకుంటే పొరపాటే. అంత ఎత్తైన శిఖరంలా కనిపించే ఈ ఆకాశం సౌధంలో నివాసానికి అనుగుణంగా తీర్చిదిద్దారు. అత్యంత విలాసవంతమైన నివాసాలకు నిలయంగా మార్చారు. ఈ లగ్జరీ లైఫ్ స్టైల్‌కు చిరునామాగా మారిన ఈ బుర్జ్ ఖలీఫాలో అపార్ట్‌మెంట్ కొనాలంటే కోట్లు కుమ్మరించాల్సిందే. ఈ ప్రపంచంలోనే ఎత్తైన ఈ భవనంలో నివసించాలని ఎవరు కోరుకోరు. ఎన్ని కోట్లైనా సరే పెట్టేందుకు బడా వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు క్యూ కడతారు. అలా ఈ ఆకాశ సౌధంలో మన సినీతారలు సైతం అపార్ట్‌మెంట్స్ కొనేశారు. ఇందులో బాలీవుడ్ భామ శిల్పాశెట్టితో పాటు మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ఖరీదైన ఫ్లాట్లను తమ సొంతం చేసుకున్నారు. ఆ వివరాలేంటో చూసేద్దాం.



బాలీవుడ్ ముద్దుగుమ్మ శిల్పాశెట్టి ఈ ఫ్లాట్ బహుమతిగా లభించింది. ఆమె భర్త, నటుడు రాజ్ కుంద్రా వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుర్జ్ ఖలీఫాలో లగ్జరీ ఫ్లాట్‌ను తన సతీమణికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఆమె విలాసవంతమైన నివాసం 19వ అంతస్తులో ఉంది. దీని విలువ దాదాపు రూ. 50 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా.

### మోహన్ లాల్ స్వర్గధామం..

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ సైతం బుర్జ్ ఖలీఫాలో అపార్ట్‌మెంట్ కొనుగోలు చేశారు. ఆయన 29వ అంతస్తులో లగ్జరీ ఫ్లాట్‌ను కొన్నారు. దాదాపు 940 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లో ఆధునాతన సౌకర్యాలు ఉన్నాయి. దీని విలువ దాదాపు రూ. 3.5 కోట్లు ఉంటుందని అంచనా. అయితే ఈ ఫ్లాట్‌ను మోహన్ లాల్ తన భార్య సుచిత్ర మోహన్‌లాల్ పేరు మీద రిజిస్టర్ చేశారు. వీరితో పాటు కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జార్జ్ వి నీరియపరంబిల్‌కు ఈ భవనంలో దాదాపు 22 ఫ్లాట్స్ కొనుగోలు చేశారట. అందువల్లే ఆయనను బుర్జ్ ఖలీఫా రాజు అని ముద్దుగా పిలుస్తారట.



# అప్పట్లో కాస్టింగ్ కౌచ్ ట్రెండ్..
## నేను రోడ్డు మీద పడ్డా..

అవకాశాలిస్తాం.. మరి మాకేంటి? ఒకానొక దశలో ఈ మాటలు వినీవినీ విసిగిపోయానంటోంది హీరోయిన్ సుర్వీన్ చావ్లా. కాస్టింగ్ కౌచ్ వల్ల ఎన్నో అవకాశాలు కోల్పోయానంది. అయినప్పటికీ ఇండస్ట్రీలో ధైర్యంగా నిలబడ్డానంది. సుర్వీన్ చావ్లా ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ వెబ్ సిరీస్ మండల మర్డర్స్. ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో జూలై 25 నుంచి ప్రసారం కానుంది.

### అసహ్యంగా అనిపించింది

ఈ సిరీస్ ప్రమోషన్స్‌లో సుర్వీన్ చావ్లా మాట్లాడుతూ.. ఒకానొక సమయంలో కాస్టింగ్ కౌచ్ చాలా ఎక్కువగా ఉండేది. ఏం చేయాలన్నా మాకేంటి? అని చెండాలంగా మాట్లాడేవారు. ఆ పరిస్థితుల్లో నాకు బయటకు వెళ్లాలంటే కూడా అసహ్యంగా అనిపించేది. అసలు ఇవన్నీ నాకు అవసరమా? అని తిట్టుకునేదాన్ని. యాక్టింగ్ మానేయాలన్నంత కోపం వచ్చేది. వాళ్లు అడిగినదానికి ఒప్పుకోకపోవడం వల్ల ఎన్నో అవకాశాలు చేజారాయి. చివరకు రోడ్డుమీద పడ్డట్లు అనిపించింది.

### వెబ్ సిరీస్‌లతో టాప్..

ఆ రోజులు చాలా కష్టంగా గడిచాయి. నేను ఈ ఇండస్ట్రీకి వచ్చింది దీనికోసమేనా? అని నిరాశచెందేదాన్ని. నా వల్ల కాదు, సినిమాలు మానేద్దాం అనుకున్న రోజులు కూడా ఉన్నాయి అని చెప్పుకొచ్చింది. సుర్వీన్ చావ్లా.. రాజు మహారాజు అనే తెలుగు మూవీలో హీరోయిన్‌గా యాక్ట్ చేసింది. హిందీలో అగ్లీ, హేట్ స్టోరీ 2 వంటి మూవీస్ చేసింది. ఓటీటీలో సేక్రెడ్ గేమ్స్, రానా నాయుడు, క్రిమినల్ జస్టిస్: ఎ ఫ్యామిలీ మ్యాటర్ వెబ్ సిరీస్‌లు చేసింది.



# కింగ్‌డమ్ మూవీ..
## ఏపీలో టికెట్ ధరల పెంపునకు అనుమతి

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ యాక్షన్ చిత్రం కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో వస్తోన్న ఈ చిత్రం జూలై 31న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సినిమాలో విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కనిపించనుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమా టికెట్ రేట్ల పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతులిచ్చింది. సినిమా విడుదల రోజు నుంచి పది రోజుల వరకు ధరలు పెంచుకోవచ్చని ఆదేశాలిచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.75 అదనంగా వసూలు చేసేందుకు అనుమతులు జారీ చేసింది.

కాగా.. ఈరోజు రిలీజైన పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లుకు భారీగా ధరలు పెంచుకునేందుకు పర్మిషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.



# అతనే గట్టి దెబ్బేశాడు..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన హరిహర వీరమల్లు సినిమా ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తున్నప్పటికీ, టాక్ విషయంలో మాత్రం కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ అభిమానులు సైతం ఈ సినిమాపై కొంత నెగెటివ్‌గా స్పందించడం చర్చనీయాంశంగా మారింది.

**దర్శకుల మార్పు ప్రభావం**


పవన్ కళ్యాణ్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నప్పటికీ, దర్శకుడు మారడం సినిమాకు పెద్ద మైనస్ అయిందని చెప్పాలి. క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాను తెరకెక్కించి ఉంటే బాగుండేదని చాలామంది అభిప్రాయపడుతున్నారు. జ్యోతి కృష్ణకు దర్శకుడిగా పెద్దగా అనుభవం లేకపోవడం, గతంలో ఆయన తీసిన ఒకటి రెండు సినిమాలు నిరాశపరచడం, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్ హీరోను హ్యాండిల్ చేయలేకపోవడం సినిమా ఫలితంపై ప్రభావం చూపింది. క్రిష్ రాసుకున్న కథ బాగున్నప్పటికీ, దానిని దృశ్య రూపంలోకి తీసుకురావడంలో జ్యోతి కృష్ణ విఫలమయ్యారని స్పష్టమవుతోంది.

**కోర్ ఎమోషన్ మిస్సింగ్, స్లో సెకండ్ హాఫ్**

ఏ సినిమా అయినా ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే అందులోని కోర్ ఎమోషన్ను తెరపై సమర్థవంతంగా ప్రదర్శించాలి. కానీ "హరిహర వీరమల్లు"లో అది లోపించింది. ముఖ్యంగా సినిమా సెకండ్ హాఫ్ చాలా నెమ్మదిగా సాగడం, ప్రేక్షకుడిని ఏమాత్రం ఆకట్టుకోలేకపోవడం సినిమాకు భారీ మైనస్‌గా మారింది.

**పవన్ కళ్యాణ్ స్వాగ్, నటనపై ప్రశంసలు**

చాలా రోజుల తర్వాత పవన్ కళ్యాణ్ నుంచి వచ్చిన సినిమా కావడంతో, అతని అభిమానులకు కొంతవరకు నచ్చుతోంది. పవన్ కళ్యాణ్ తనదైన స్వాగ్ను ప్రదర్శించడంలో మరోసారి సక్సెస్ అయ్యాడు. ఆయన రేంజ్ యాక్టింగ్తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేశాడు. సినిమాలో ఉండాల్సిన అన్ని అంశాలు ఉన్నప్పటికీ, వాటిని తెరపై పర్ఫెక్ట్‌గా డెలివరీ చేయడంలో మాత్రం కొంత లోపం కనిపించింది. పవన్ కళ్యాణ్ యాక్షన్ కొరియోగ్రఫీ కూడా చాలా బాగుంది. అప్పుడెప్పుడో నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలు ఈ సినిమాకు చాలా ఉపయోగపడ్డాయని చెప్పాలి. మొత్తానికి, "హరిహర వీరమల్లు" పవన్ కళ్యాణ్ అభిమానులకు కొంత వరకు నచ్చినా, సగటు ప్రేక్షకుడు మాత్రం నిరాశ చెందుతున్నాడని స్పష్టమవుతోంది.



# ఇండస్ట్రీకి కొత్త హీరోయిన్..
## సెల్ఫీలంటే ముఖం చాటేస్తోంది!

ఒక్క సినిమాతో సెన్సేషన్ అయింది యంగ్ బ్యూటీ అనీత్ పడ్డా. తను కథానాయికగా నటించిన తొలి చిత్రం సైయారా. అహాన్ పాండే (అనన్య పాండే కజిన్) హీరోగా నటించిన ఈ చిత్రానికి ప్రశంసలతో పాటు భారీ కలెక్షన్స్ కూడా వస్తున్నాయి. మోహిత్ సూరి దర్శకత్వం వహించిన ఈ మూవీ జూలై 18న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హీరోహీరోయిన్లు కొత్తవారైనప్పటికీ జనం ఈ చిత్రాన్ని అక్కున చేర్చుకున్నారు. కేవలం మౌత్‌టాక్‌తోనే ఈ మూవీ ఇప్పటివరకు రూ.153 కోట్లు రాబట్టడం విశేషం. ఈ దూకుడు చూస్తుంటే ఈ వారాంతంలో సైయారా రూ.200 కోట్ల మార్కును చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

### వీడియో వైరల్

ఇదిలా ఉంటే తాజాగా అనీత్ పడ్డా ముంబైలోని ఓ సెలూన్‌కు వెళ్లింది. అక్కడినుంచి బయటకు వస్తుండగా ఫోటోగ్రాఫర్లు ఆమెను కెమెరాల్లో బంధించేందుకు ప్రయత్నించారు. ఓ అభిమాని ఆమెతో సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించాడు. అయితే ముఖానికి మాస్క్ ధరించిన అనీత్.. సున్నితంగా అతడి అభ్యర్థనను తిరస్కరించింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com